# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 355 | పేజీలు: 5 | వెల: రూ.4/- | శనివారం 9 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## సృష్టి ఫెర్టిలిటీ కేసు వ్యవహారం

### ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)

సృష్టి ఫెర్టిలిటీ- కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. శిశువుల అక్రమ రవాణా, మధ్యవర్తుల హస్తంతో నడిచిన ఈ అమానవీయ ఘటనలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. విశాఖ కేంద్రంగా జరిగిన ఈ స్కాంలో ఇప్పటి వరకూ ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా, హైదరాబాద్ పోలీసులు విచారణలో భాగంగా విశాఖలో ముగ్గురు మధ్యవర్తులు అయిన విజయ్, సరోజ, రత్నాను అరెస్టు చేశారు. ఈ మధ్యవర్తులు శిశువుల కొనుగోలు, అమ్మకాల్లో కీలకంగా వ్యవహరించినట్లు- ఆధారాలు లభించాయని సమాచారం. సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్ వ్యవహారంలో నవజాత శిశువులను పేద కుటు-ంబాల నుంచి తీసుకొని దరఖాస్తు చేసుకున్న జంటలకు పెద్ద మొత్తాలకు విక్రయించినట్లు- పోలీసులు గుర్తించారు.

# ఓట్ల దొంగలకు శిక్ష తప్పదు

- బిజెపికి తొత్తుగా ఎన్నికల సంఘం..
- ఓట్ల దొంగతనానికి ఇసి సహకారం
- తన ఆరోపణలపై ఇసి ఎందుకు మౌనం
- వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి
- బెంగళూరు సమావేశంలో రాహుల్ తీవ్ర విమర్శలు

బెంగళూరు, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)

ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లా డుతూ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని,

..మిగతా 2లో





## ఉజ్వల్ యోజనకు సబ్సిడీ కొనసాగింపు

### చమురు కంపనీలకు 30 వేల కోట్ల సబ్సిడీ చెల్లింపు

### కేంద్రకేబినేట్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)

ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది.ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపనీలకుకు 30 వేల కోట్ల సబ్సిడీని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దేశీయ ఎల్ పీజీ అమ్మకాలపై కంపెనీలకు కలిగే నష్టాలను భర్తీ చేయడానికి ఈ సబ్సిడీని ఉద్దేశించారు. దీనిని 12 భాగాలుగా చెల్లిస్తారు. 2025-26 ఆర్థికసంవత్సరానికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వినియోగదారులకు రూ. 12 వేల సబ్సీడీని కొనసాగించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. భారతదేశం అంతటా శుభ్రమైన వంట గ్యాస్ నిరంతరం వినియోగించుకునేలా ప్రోత్సహించడం ద్వారా లబ్దిదారులకు ఎల్ పిజి కనెక్షన్లు మరింత చౌకగా అందించడమే ఈ సబ్సిడీ లక్ష్యం.మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు సబ్సిడీలను అందించనున్నట్లు- పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ తెలిపింది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసిఎల్) భారత పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ( హెచ్ పిసిఎల్) మధ్య పంపిణీ చేస్తుంది. అంతర్జాతీయంగా చమురు ధరల్లో మార్పుల నుంచి వినియోగదారులకు

..మిగతా 2లో

## ప్రతీ వరద నీటి బొట్టు మూసీలోకి చేరేలా

# ప్రణాళిక సిద్ధం చేయండి

### ఓఆర్ఆర్ వరకు వరదనీటి సమస్య ఉండొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)

నగరంలో వర్షాలతో తలెత్తే ఇబ్బందులకు, వరద సమస్య పరిష్కారంపై శుక్రవారం, సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తీసుకున్నారు. గురువారం, కురిసిన వర్షానికి హైదరాబాద్ నగరం అతలాకుతలమైన పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండటమే నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందన్న అధికారులు స్పష్టం చేశారు. దీనిలో భాగంగా అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్.. ‘ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ లోని వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్ నగరంలోని వరదనీరు మూసీని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. ప్రతీ చెరువు, నాలాలు, ఇతర కాలువలను మూసీకి అనుసంధానం చేయండి. చెరువులను పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయండి. ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటునుంచి మూసీలోకి చేరేలా చర్యలు చేపట్టండి. భవిష్యత్ లో నగరంలో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనం అవసరం. మూసీ పునరుజ్జీవనమే వరద



సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆ దిశగా ప్రణాళికలు రూపొందించండి. మూసీ పునరుజ్జీవనంతో వర్షాకాలంలో నీటి ప్రవాహం, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టొచ్చు. ఆ దిశగా హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి’ అని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు.

## ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు

- బండి సంజయ్‌పై కేటీఆర్ ఫైర్
- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై బండి సంజయ్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్
- లేకపోతే పరువునష్టం దావా వేస్తానని తీవ్ర హెచ్చరిక
- త్వరలోనే లీగల్ నోటీసులు పంపుతామని వెల్లడి
- బండికి కనీస పరిజ్ఞానం కూడా లేదంటూ ఘాటు విమర్శలు



హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపై చేసిన ఆరోపణలను 48 గంటల్లోగా వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బండి సంజయ్‌పై పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తానని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు. ఈ మేరకు త్వరలోనే ఆయనకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపనున్నట్లు స్పష్టం చేశారు.కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాజకీయ లబ్ధి కోసమే తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క ఆధారం ఉన్నా బయటపెట్టాలని సవాల్ విసిరారు. కేవలం తన ఢిల్లీ బాస్‌లను మెప్పించడం కోసమే బండి సంజయ్ ఇలాంటి వీధి డ్రామాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తీరుపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. “హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తికి ఇంటెలిజెన్స్ పనితీరుపై కనీస అవగాహన అటుంచి, సాధారణ పరిజ్ఞానం కూడా లేదు. ఆయన వ్యాఖ్యలు హద్దులు మీరుతున్నాయి” అని విమర్శించారు. “ఢిల్లీ బాస్‌ల చెప్పులు మోసినంత సులభం కాదు బాధ్యతాయుతమైన మంత్రి పదవిని నిర్వహించడం,” అంటూ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ చేస్తున్న అసత్య ప్రచారాలు ఆయన స్థాయిని మరింత దిగజార్చుతున్నాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.



## అమెరికాకు షాక్!

### బోయింగ్ విమానాల ఒప్పందాన్ని నిలిపేసిన భారత్?

### భారత్‌పై 50 శాతం టారిఫ్‌లను ట్రంప్ విధించిన వేళ బదులు తీర్చుకుంటున్న కేంద్రం!

2



## భార్యాభర్తల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు

- ఆ ఇద్దరినీ సమాజం క్షమించదు : బండి సంజయ్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన బండి సంజయ్ విచారణ
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన బండి
- కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డిపై పలు విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని, అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని

..మిగతా 2లో

# అమెరికాకు షాక్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)**

భారత్‌పై సుంకాలతో రెచ్చిపోతున్న అగ్రరాజ్యం అమెరికాకు భారత్ షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అమెరికా నుంచి బోయింగ్ విమానాల కొనుగోలు చేయడానికి చేసుకున్న 3.6 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాన్ని భారత్ నిలిపివేసినట్లు జాతీయ మీడియా చెప్పుకొచ్చింది. 6 పీ-8%×% జెట్ల కొనుగోలు కోసం 2021లో 2.42 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం భారత్, అమెరికా మధ్య జరిగింది. ముడిసరకు ధరలు, ద్రవ్యోల్బణం, ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో ఈ డీల్ విలువ 3.6 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే, భారత వస్తువులపై 50 శాతం టారిఫ్‌లను ట్రంప్ విధించిన వేళ ఇండియా ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.



## భారీగా పెరిగిన ఖర్చు

ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో ఈ ప్రాజెక్ట్ వ్యయం భారీగా పెరిగినట్లు సమాచారం. దీనివల్ల విమానాల విడిభాగాలు, భాగాలు ఖరీదైనవిగా మారిపోతాయి. దీంతో జెట్ల డీల్ విలువ దాదాపు 50 శాతం పెరగనుంది. ఈ ఖర్చు భారమంతా ఇండియా మీదే పడనుంది. ఈ క్రమంలో అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి. అయితే ఈ డీల్‌ను వ్యూహాత్మకంగానే నిలిపేసిందని పలు నివేదికలు చెబుతున్నాయి. పెరుగుతున్న ఖర్చులు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి అంశాలు ఈ నిర్ణయంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఒప్పందం రద్దు గురించి భారత ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు.

## ధరలు 50శాతం ఎందుకు పెరుగుతాయి?

జెట్ల తయారీకి ముడి సరుకులు భారత్ నుంచి ఎగుమతి అవుతాయి. తాజాగా భారతీయ వస్తువులపై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో వాటి ధరలు అమెరికాలో భారీగా పెరుగుతాయి. దీంతో ఈ డీల్ విలువ భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ భారం భారత్ పడే అవకాశం ఉన్నందువల్ల ఈ ఒప్పందాన్ని ఇండియా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## భారత్- యూఎస్ బోయింగ్ ఒప్పందం ఏంటీ?

ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్లను అమెరికాలో రెట్రోఫిట్టింగ్ కోసం పంపించడం ప్రారంభించిన తర్వాత రెండు దేశాల మధ్య బోయింగ్ జెట్ విమానాల డీల్ కుదిరింది. ఎయిర్ ఇండియా వద్ద మొత్తం 33 డ్రీమ్ లైనర్లు ఉండగా, వాటిలో 26 లెగసీ బోయింగ్ 787-8లు. మిగతా 7 బోయింగ్ 787-9లు. ఎయిర్ ఇండియా మొదటి లెగసీ డ్రీమ్ లైనర్లను అమెరికాలోని బోయింగ్ ఫెసిలిటీలోని రెట్రోఫిట్ కోసం పంపించారు. టెంప్లేట్‌గా ఉండే రెట్రోఫిట్ చేసిన విమానం ఈ ఏడాది చివరి నాటికి ఫ్లీట్‌లో చేరుతుందని ఆశిస్తున్నారు. అది పూర్తయిన తర్వాత, ప్రతి నెలా రెండు లెగసీ డ్రీమ్ లైనర్లను రెట్రోఫిట్ చేయడానికి పంపాలని ఎయిర్ లైన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వర్గాలు పేర్కొన్నాయి. ఈ రెట్రోఫిట్ చేసిన విమానాలు థర్డ్ క్లాస్ కాన్ఫిగరేషన్‌ను కలిగి ఉంటాయి. వీటిలో ప్రతి ఒక్కటి 20 బిజినెస్ క్లాస్, 25 ప్రీమియం ఎకానమీ, 205 ఎకానమీ క్లాస్ సీట్లతో ఉంటాయి.

## భారత్‌పై ట్రంప్ అక్కసు

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న నెపంతో భారత్ పై 50 శాతం సుంకాలను అమెరికా అధ్యక్షుడు ఇప్పటికే విధించారు. ఈ క్రమంలో భారత్ కూడా దీటుగా స్పందిస్తూ తమ దేశంలోని రైతుల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. ఈ క్రమంలో ట్రంప్ మరోసారి భారత్ గురించి వ్యాఖ్యానించారు. టారిఫ్‌ల వివాదం పరిష్కారం అయ్యేవరకు న్యూదిల్లీతో ఎలాంటి వాణిజ్య చర్చలు ఉండవని అన్నారు.



### 11న బిజెపిలోకి

# గువ్వల బాలరాజు

**హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)**

బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరబోతున్నారు. ఇప్పటికే ఈ విషయం ప్రకటించారు. అయితే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు బాంబు పేల్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఆ ఎమ్మెల్యేలు ఎవరనేది త్వరలో చెబుతామన్నారు. ఆ ఎమ్మెల్యేలు.. మా పార్టీలో చేరే తేదీలు సైతం తెలియజేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్‌తో రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేక తమ వైపు వారు చూస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలే కాదని.. ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఆగస్ట్ 10వ తేదీన బీజేపీలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేరనున్నారని తెలిపారు. బీజేపీలో చేరికలకు ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇలా పార్టీలో చేరే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తేనే అసలు దోషులు బయటకు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం లేదన్నారు. అయితే ఓటర్ల జాబితా అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అయన అసహనానికి పరాకాష్టగా తెలంగాణ బీజేపీ చీఫ్ అభివర్ణించారు. బీసీల మీద ప్రేమ.. సీఎం రేవంత్ రెడ్డికి కొత్తగా వచ్చిందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే అచ్చంపేట బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో భేటీ అయ్యారు. తార్నాకలోని నివాసంలో ఆయన సమావేశమయ్యారు. ఇటీవలే గువ్వల బాలరాజు భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేశారు. ఈ నెల 11న ఆయన భాజపాలో చేరనున్నారు.



# భార్యాభర్తల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు

మొదటి పేజీ తరువాయి...

ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా తన ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారని కేంద్రమంత్రి బండి సంజయ్ వివరించారు. తన కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యా భర్తల ఫోన్లు ట్యాప్ చేసి విన్నారని మండిపడ్డారు. తన వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారు లకు ఇచ్చినట్లుగా తెలిపారు. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలని, కానీ, ఆ జాబితాలో తమ పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్న బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది తానేనని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడేందుకు భయపడి వాట్సప్ కాల్స్ మాట్లాడేవాళ్లని అన్నారు. అప్పటి భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి సంజయ్ వివరించారు.

వారిద్దర్నీ సమాజం క్షమించదు : కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు ట్యాప్ చేశారని వారినీ విచారణకు పిలవాలి అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఎస్ఐబీని సొంత అవసరాలకు అడ్డాగా కేటీఆర్ మార్చారని మండిపడ్డారు. నాయకులు, లాయర్లు, వ్యాపారులు, సినీ నటులు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి సంజయ్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారని బండి సంజయ్ అన్నారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా అనేక లావాదేవీలకు సంబంధించి లబ్ధి పొందారని ఆరోపించారు. ప్రభాకర్‌రావు, రాధా కిషన్‌రావు బాగోతం చెబుతుంటే తనకే సిగ్గనిపించిందన్నారు. వారిద్దర్నీ సమాజం క్షమించదని, ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారని, క్షణక్షణం బాధపడాలన్నారు. తమ కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురి చేశారని వివరించారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారని విమర్శించారు.ఫోన్ ట్యాపింగ్ ద్వారా వేలకోట్లు దోచుకున్నారు : ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు పట్టుకున్నారని గుర్తుచేశారు. ఆ డబ్బు ఏమైందో తెలియదని చాలా మంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు సీజ్ చేసి పట్టుకున్నారన్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారని సంజయ్ ఆరోపించారు. రూ.20 కోట్లు దొరికితే కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు అవుతాయన్నారు.

రూ.వేల కోట్లు అక్రమాలు జరిగితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? అని ప్రశ్నించారు. ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుందని సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదని బండి సంజయ్ వివరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతాఅని అన్నారు. ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారని ప్రశ్నించారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారని, నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు అని బండి సంజయ్ ఆక్షేపించారు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదు అని దుయ్యబట్టారు.

# కాళేశ్వరం నివేదిక ఇవ్వండి

### సిఎస్‌ను కోరిన హరీష్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన పూర్తి నివేదికను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కోరారు. శుక్రవారం ఆయన సచివాలయానికి వెళ్లి సీఎస్ రామకృష్ణరావును కలిశారు. జస్టిస్ ఘోష్ ఇచ్చిన 665 పేజీల నివేదిక ప్రతులను ఇవ్వాలని కోరుతూ.. కేసీఆర్, హరీష్ రావు పేరుతో వేర్వేరు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం వినతిపత్రాలు ఇచ్చినట్లు- రశీదులు తీసుకున్నారు. హరీశ్‌రావు విజ్ఞప్తిని పరిశీలించి చెబుతామని సీఎస్ చెప్పినట్లు- సమాచారం. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు హరీష్ రావు వెంట ఉన్నారు.

# ఎస్సీఓ సదస్సుకు రండి



**న్యూఢిల్లీ, ఆగస్టు 8 (నమస్తే ఉదయం)**

భారత్, చైనా మధ్య సంబంధాల విషయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. ఈ నెలాఖరులో టియాంజిన్ నగరంలో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్నట్లు చైనా శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో టియాంజిన్‌లో ఎస్సీఓ సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి భారత ప్రధాని మోదీ వస్తున్న విషయాన్ని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ధృవీకరించారు. "ఎస్సీఓ టియాంజిన్ సదస్సు కోసం ప్రధాని మోదీ చైనాకు రావడాన్ని మేము స్వాగతిస్తున్నాం. అన్ని సభ్య దేశాల సమష్టి కృషితో ఈ సదస్సు విజయవంతమవుతుందని, ఎస్సీఓ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని విశ్వసిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. గల్వాన్ ఘర్షణల అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాదాపు నాలుగేళ్ల పాటు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగాయి. అయితే, ఇటీవలే వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి గస్తీ విషయంలో ఇరు దేశాల మధ్య ఒక అంగీకారం కుదరడంతో ప్రతిష్టంభన వీడింది. ఈ సానుకూల వాతావరణంలోనే ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. 2019 తర్వాత మోదీ చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం. ఈ పర్యటనకు ముందు, ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయి. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఇటీవలే చైనాలో పర్యటించారు. ముఖ్యంగా, ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడాలని, లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అజిత్ దోవల్ ఎస్సీఓ భద్రతా సలహాదారుల సమావేశంలో గట్టిగా నొక్కి చెప్పారు.

# ఓట్ల దొంగలకు శిక్ష తప్పదు

మొదటి పేజీ తరువాయి...

ఈ ఎన్నికల్లో న్యాయం నిలవాలంటే అధికార యంత్రాంగం కక్ష సాధింపులు చేయకుండా వ్యవహరించాలంటూ రాహుల్ గాంధీ హితవు పలికారు. అంతేకాదు, కర్ణాటకతో పాటు- ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో మీరు రాజ్యాంగాన్ని తాకాలని అనుకుంటే, ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఈ విషయంలో మీరు ఎంత తెలివిగా దాక్కున్నా, మేము మిమ్మల్ని పట్టుకుంటామన్నారు. ఇందుకు కొంచెం సమయం పట్టొ-చ్చు, కానీ తప్పకుండా పట్టుకుంటామని రాహుల్ గాంధీ ఎన్నికల సంఘానికి వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలు దేశ గుండె చప్పుడని, అలాంటి క్రమంలో ఒక్క ఓటు- దొంగిలించబడినా అది జనాభా గొంతును నొక్కేయడమేనని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ఇలాంటి ఘటనలు జరిగితే, అది రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా డెమాక్రసీకి సవాల్‌గా మారుతుందన్నారు. నిజంగానే ఎన్నికల సంఘం ఎవరి పక్షం వైపు ఉందని ప్రశ్నలు పలువురిలో వచ్చే అవకాశం ఉంది. ఇది ఒక్క కర్ణాటక సమస్య మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమగ్రత గురించి చర్చకు దారితీస్తుంది. కానీ, రాహుల్ గాంధీ ఇక్కడితో ఆగలేదు. ఆయన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాన్ని కాపాడటానికి తాము ఎంతకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ ఐదు ప్రశ్నలు సంధించారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచి పెడుతున్నారు?. సీసీ పుటేజీని ఎందుకుఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు? నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు. విపక్షాలను ఈసీ ఎందుకు భయపెడుతోంది. భాజపా ఏజెంట్‌గా ఈసీ మారిపోయిందా?అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్ష కంటే ఎక్కువ దొంగ ఓట్లున్నాయి. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయ్యిందని రాహుల్ ఆరోపించారు. 40 మందితో కూడిన బృందం ఆరు నెలలపాటు- నిర్వహించిన విశ్లేషణలో వేలాది నకిలీ ఎంట్రీలు, నకిలీ చిరునామాలు చెల్లని ఫొటోలు, అనుమానాస్పద ఫారం 6 దరఖాస్తులు బయట పడ్డాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్, సిఎం సిద్దరామయ్య, డిప్యూటి సిఎం డికె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. తను చేసే వాదనలను ధృవీకరిస్తూ అధికారిక ప్రకటనపై సంతకం చేయాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ దగ్గర రెండు ఆప్షన్‌లే ఉన్నాయి. ఒకటి ఆయన చేసే ఆరోపణలు నిజమనుకుంటే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడం లేదా.. ఇసిఐపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు దేశానికి క్షమాపణలు చెప్పడం అని ఎన్నిక సంఘం వర్గాలు తెలిపాయి.

# ఉజ్వల్ యోజనకు సబ్సిడీ కొనసాగింపు

మొదటి పేజీ తరువాయి...

రక్షణ కల్పిండడం, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు మద్దతు ఇవ్వడం ఈ నిర్ణయం లక్ష్యం అని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. చమురు, గ్యాస్ రంగాల్లో అనిశ్చితి కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు.మధ్యతరగతికి వంటగ్యాస్ అందుబాటులో ఉండేలా చూడడం కోసం, రూ.30 వేల కోట్ల సబ్సిడీ ఆమోదించినట్లు- తెలిపారు అశ్విని వైష్ణవ్ .ప్రధాన్ మంత్రి ఉజ్వల్ యోజన (పిఎంయువై) 2016 మే లో ప్రారంభమైంది. భారతదేశం అంతటా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వయోజన మహిళలకు డిపాజిట్ లు లేకుండా ఎల్ పిజి కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా సాగుతోంది. 2025 జూలై 1 నాటికి దేశవ్యాప్తంగా 10కోట్ల 33 లక్షల ఎంఎంయువై కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల యోజన సబ్సిడీ కొనసాగించడం వల్ల వినియోగదారుడు ఎటు-వంటి డిపాజిట్ లేకుండానే ఎల్ పిజి కనెక్షన్ అందుకుంటాడు.అంతేకాదు, సిలెండర్, ప్రెషర్ రెగ్యులేటర్, సేఫ్టీ హోస్, డమెస్టిక్ గ్యాస్ కన్స్యూమర్ కార్డు బుక్ లెట్ అందించడంతో పాటు- ఇన్‌స్టలేషన్ చార్జీలకోసం సెక్యూరిటీ- డిపాజిట్ ను కవర్ చేస్తుంది.

ఉజ్వల 2.0 పథకం కింద వినియోగదారుడు తన మొదటి స్టవ్, రీఫిల్ కూడా ఉచితంగా పొందుతారు. అంతర్జాతీయ ఎల్ పిజి ధరల అస్థిరత నుంచి ఉజ్వల్ యోజన వినియోగదారులను కాపాడేందుకు, క్రమబద్ధీకరించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2022 మేలో లక్ష సబ్సిడీని ప్రవేశపెట్టింది. సంవత్సరానికి 12 రీఫిల్ లకు 14.2 కిలోల సిలెండన్ ను కేవలం 200 రూపాయలకే అందిస్తుంది. ఈ సబ్సిడీని 2023 అక్టోబర్ లో రూ.300 కు పెంచారు.ఉజ్వల యోజన లబ్దిదారులలో ఎల్ పిజి సగటు- తలసరి వినియోగం (పిసిసి) క్రమంగా పెరిగింది. 2019-20లో మూడు రీఫిల్లనుంచి 2022.23లో సగటు- వినియోగం 3.68 కి పెరిగింది. 2024-25లో సుమారు 4.47 రీఫిల్ లకు చేరింది. ఇది వంటగ్యాస్ వినియోగంలో మహిళలు చూపుతున్న శ్రద్ధను ప్రతిబింబిస్తోంది.



# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

కేటిదొడ్డి, ఆగస్టు8(నమస్తే ఉదయం) శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎంతో విశిష్టత ఉండటంతో హిందూ సాంప్రదాయం ప్రకారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా శుక్రవారం కేటిదొడ్డి మండలంలో వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా వ్రతక్రతువులో పాల్గొని అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా కుచినెర్ల గ్రామంలో మహిళలు తమ గృహాలలో వరలక్ష్మి ప్రతిమ ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ విద్యార్థులు, ఉద్యోగులు ముందుకు రావాలి



మహాత్మా జ్యోతి రావు పూలే, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లు



సెమినార్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## మంత్రి పొన్నం ప్రభాకర్

బుద్వేల్, ఆగస్టు 8(నమస్తే ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ లో బీసీలకు ఇవ్వాలనుకుంటున్న 42శాతం రిజర్వేషన్లను సాదించుకోవడానికి విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు కలసి రావాలని రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ రిజర్వేషన్ల చట్టంలో మత పరమైన రిజర్వేషన్లు ఎక్కడ లేవన్నారు. బీజేపీ అసెంబ్లీలో మద్దతు ప్రకటించి బయట అనవసర విమర్శలు చేస్తుందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ సెల్ ను బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ జి.నిరంజన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్ధాస్ జానయ్యలతో కలసి ప్రారంభించారు. బీసీ రిజర్వేషన్లు కేవలం రాజకీయాలలోనే కాదని, విద్యా, ఉద్యోగ రంగాలలోను బీసీలకు రిజర్వేషన్లు వర్తించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో, విద్యా సంస్థలలో బీసీ సెల్ లను ఏర్పాటు చేసుకుని తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలా రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీలు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయితే విద్యార్థులకు, ఉద్యోగులకు చాలా మేలు జరుగుతుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు కొత్త వంగడాలు, పరిజ్ఞానం, సాంకేతికతను అందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. తమ ప్రభుత్వానికి వ్యవసాయం ప్రాధన్యత అయిన అంశం అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంతా వ్యవసాయ విశ్వవిద్యాలయం కు వచ్చి రైతు బరోసా నిదులను విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. వ్యవసాయ కళాశాలలు, పరిశోధన స్థానాలకు వెళ్లేందుకు రైతులు, విద్యార్థులకు రవాణ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థుల స్కాలర్ప్ పెండింగ్ అంశంపై త్వరలోనే సమీ క్షిస్తామన్నారు. ఆస్ట్రేలియా లోని వెస్టన్ సిడ్నీ విశ్వవిద్యాలయం తో కలసి పీజీటీఏయు డ్యూయల్ డిగ్రీ అందించడం గొప్ప ముందడుగు అని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. అందులో భాగంగా యూజీ, పీజీ విద్యార్థులకు కొంత శాతం ఆర్థిక సహయం అందించేందుకు సానుకూలంగా పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. స్థానిక శాసనసభ్యులు టి.ప్రకాశ్ గౌడ్ బీసీ సెల్ లో మౌళిక వసతుల కోసం రూ. 10లక్షల ను అందజేస్తారని మంత్రి ప్రకటించారు. ఎంతో అనుభవం, పట్టుదల ఉన్న ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య నేతృత్వంలో వ్యవసాయ వర్శిటీ మంచి అభివృద్ధి పథాన సాగుతుందని అన్నారు. దేశ విదేశాలలోని అధునాతన విజ్ఞానం రైతులకు చేరుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైన 60 సంవత్సరాలకు ఉప కులపతిగా బీసీ వ్యక్తి నియమితులవడం. బీసీ సెల్ ఏర్పాటు చేయడం హర్షదాయకు అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్టాస్ జానయ్య బాగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్, బీసీ సెల్ అఫీసర్ డాకర్ సీహెచ్ దామోదర రాజు, ప్రొఫెసర్ ఎం.సుజాత, భిక్షపతి, కవి రాజ్, భావన, లు పాల్గొన్నారు.



# మీరు నాటిన మొక్కకు ఆహారంగా నీరు క్రమం తప్పక పోయాలి

### ఆదిత్య హైస్కూల్లో నిర్వహించిన వన మహోత్సవంలో విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హితవు

రాజేంద్రనగర్, ఆగస్టు 8(నమస్తే ఉదయం) ప్రతి విద్యార్థి తాను నాటిన మొక్కకు ప్రతి రోజు క్రమ పద్దతిలో నీరు పోసి పెంచాలని రాజేంద్రనగర్ శాసన సభ్యుడు కోరారు. నేడు మీరు నాటే చిన్న మొక్కనే రేపటికి మహా వృక్షమై సమాజానికి ఫలాలను, ఆక్సిన్ను అందిస్తుందన్న సత్యాన్ని విద్యార్థులంకా గ్రహించాలని చెప్పారు. శుక్రవారం కాటేదాన్ వెంకటేశ్వర కాలనీలో గల ఆదిత్య హైస్కూల్లో నిర్వహించిన 'వన మహొత్సవం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడేది పచ్చదనమే అన్నారు. అడవులు వృద్ధి చెందింతే ప్రకృతి రమణీయత ఉట్టిపడుతుందని, బస్తీలు, కాలనీలో చెట్లు పెరిగితే వాయు కాలుష్యాల భారీ నుంచి మనిషిని రక్షింస్తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి బోజనం ఏలా చేస్తారో నాటి మొక్కకు కూడా రెండు పూటల నీటి అందించాలని చెప్పారు. మీరు నీళ్లు సేవిస్తారు కాదా..? మరి మొక్కకు మీ వంతుగా ప్రతి రోజు నీళ్లు పోస్తారా..? అని ఆయన విద్యార్థులను అడిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాఠశాల చైర్మన్ ఉస్కెమూరి నిరంజన్, కరస్పాండెంట్ సంకూరి జయప్రకాష్, డైరెక్టర్లు అనితా రామకృష్ణ, వి. శిరీష, ప్రిన్సిపల్ ఎనగాండ్ల కృష్ణారెడ్డి తదితరులతో కలసి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రాంతాల పెద్దలు ఎద్దుల మాదవరెడ్డి, సుధాకర్ గౌడ్, కళ్లెం అంజయ్య, ఎస్. స్వామి గౌడ్, అంజనీగౌడ్, మైలార్దేవ్పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనంజయ్, బిఆర్ఎస్ నాయకుడు కొంపల్లి జగదీష్, స్థానికులు గోపాల్, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్‌తో వెటర్నరీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు డాక్టర్ కాటం శ్రీధర్

- బుద్వేల్, నమస్తే ఉదయం




# యూరియా కోసం బారులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8(నమస్తే ఉదయం)ప్రభుత్వం, అధికారులు యూరియాకు కొరత లేదని రైతులకు సరిపడా నిల్వలున్నాయని గప్పాలు చెప్పుకోవడం తప్పా ఆచరణలో మాత్రం కానరావడంలేదు. గద్వాల నియోజకవర్గంలో గద్వాల, ధరూర్, గట్టు, కేటిదొడ్డి మండలాలోని సహకార సంఘం సోసైటీ కేంద్రాల వద్ద శుక్రవారం యూరియా బస్తాల కోసం రైతన్నలు లైన్ కట్టారు. వందల సంఖ్యలో రైతులు ఉండడంతో ఒక్కో రైతుకు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ తీసుకుని ఎకరాకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. క్యూలో వేచి ఉన్నా చాలామంది రైతులకు యూరియా దొరకకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా లేక తమ పంటలు పాడైతున్నాయని ఇంకా ఎన్ని రోజులు ఈ తిప్పలు పడాలంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియాను తెప్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.



# కొత్తపాలెంలో గుర్తు తెలియని జంతువు దాడి?

ధరూర్,ఆగస్టు8(నమస్తే ఉదయం) గుర్తు తెలియని జంతువు దాడితో ఆవు దూడలు మృతి చెందాయి. దీంతో ఒకే గ్రామంలో రెండురోజుల వ్యవధిలో దాదాపు రెండు ఆవుదూడలు మృత్యువాత పడ్డాయి. గ్రామస్తులు, బాధితుక కథనం మేరకు బుధవారం రాత్రి ధరూర్ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన వెంకటేష్ కు చెందిన పశువుల పాకపై గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. అక్కడున్న ఆవు దూడను హతమార్చింది. మెడ భాగం వద్ద గాయం చేసి గుండె, కడుపులోని అవయవాలు తినేసింది. దీంతో గ్రామస్థులు, పరిసర ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విషయం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారించారు. మరోమారు గురువారం రాత్రి ఎవరు లేని సమయంలో వెంకటేష్ కు చెందిన పశువుల పాకపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి మరో ఆవుదూడను హతమార్చింది. ప్రస్తుతం చిరుత పులి తిరుగుతుందని అందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు అక్కడకు చేరుకుని అడుగుల పరిమాణం పరిశీలిస్తే 10 సెంటీమీటర్లు పొడవు,7.5 సెంటీమీటర్లు వెడల్పు గల పాదముద్రలు నిర్ధారించుకున్నారు. ఆవు దూడలపై దాడి చేసిన జంతువు యొక్క జాడలు పడటంతో కాళ్ల కొలతలు సేకరించి సంబందిత అధికారులకు నివేధిక సమర్పించడం జరిగిందని, దూడలపైదాడి చేసిన జంతువు ఏదీ అనేది ఇంకా నిర్ధారణకు రాలేదని త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎఫ్ఎస్ఓ మన్యం తెలిపారు.





శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం రాజేశ్వరి భీమ్ రెడ్డి

# శ్రీ జోగులాంబను దర్శించుకున్న మూలమల్ల రాజేష్వరి, భీమ్ రెడ్డి దంపతులు

అలంపూర్, ఆగస్టు 8(నమస్తే ఉదయం) శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం శుభ సందర్భంగా వనపర్తి రోడ్డు మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వరమ్మ భీమ్ రెడ్డి అలంపూర్ జోగులాంబ అమ్మవారు ఆలయంలో మొక్కులు చెల్లించుకుని కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం ఆవరణలోని శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు విహారిక విక్రమ్ సింహారెడ్డి ,ఇంద్రతేజ రెడ్డి సూర్య తేజరెడ్డి లు పాల్గొన్నారు.






శివరాంపల్లి శ్రీ సరస్వతి శిశు మందిరం లో జరిగిన వరలక్ష్మీ వ్రతం లో పాల్గొన్న మాతృ మూర్తులు

# శివరాంపల్లిలో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు

బుద్వేల్, ఆగస్టు 8(నమస్తే ఉదయం) : శివరాంపల్లి శ్రీ సరస్వతీ శిశుమందిరం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల సమితి అధ్యక్షులు పెండ్యాల చంద్రమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వరలక్ష్మీ వ్రతం విశిష్టత గురించి వివరించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం రెండవ శుక్రవారం రోజున శ్రవణ నక్షత్రంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు సౌభాగ్యం కోసం, కుటుంబ సభ్యుల క్షేమం కోసం భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సదాల చంద్రారెడ్డి, కందాడ జంగారెడ్డి, రాగిచెట్టి యాదిరెడ్డి, శీల సంతోష్ కుమార్, జి.ఆనిల్, సదాల శంకర్ రెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు కె. శ్రీనివాస్ తో పాటు మహిళలు పాల్గొన్నారు.

# జల సంరక్షణకు విస్తృత చర్యలు తీసుకోవాలి

**చుక్క నీరు కూడా వృధా కాకూడదు**

**ప్రతి వర్షపు చుక్కను భూమిలో ఇంకింప చేయాలి.**

**ఇందిరమ్మ ఇండ్ల పూర్తికి లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలి.**

**మొక్కలను విస్తృతంగా నాటి వన మహోత్సవం లక్ష్యాలను అధిగమించాలి...**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**


స్టేషన్ఘన్పూర్ డివిజన్ లోని గ్రామాలలో జల సంరక్షణ, ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

జనగామ, ఆగష్టు 08 (నమస్తే ఉదయం): జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని వసంత ఆధ్వర్యంలో స్టేషన్ఘన్పూర్ డివిజన్ లోని గ్రామాలలో జల సంరక్షణ, ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ముందుగా జల సంరక్షణ కార్యక్రమాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ఘన్పూర్ డివిజన్లోని విశ్వనాథపురం, రాఘవాపూర్ తానేదారిపల్లి కొత్తపల్లి, తాటికొండ, ఇప్పగూడెం, మీదికొండ, రంగరాయ గూడెం తదితర గ్రామాలలో కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాలలో జల సంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టేందుకు నిధులు సమృద్ధిగా ఉన్నాయని, అందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అందుకొరకు పట్టిష్టమైన ప్రణాళిక రూపొందించాలని , అటవీ శాఖ అధికారుల సహకారం తీసుకోవాలని, ఫాం పాండ్స్, చెక్ డ్యామ్స్, వాటర్ షెడ్స్, రీఛార్జ్ బోర్స్ వంటివి ప్రభుత్వ భూములే కాకుండా ప్రైవేటు భూములలో కూడా చేపట్టవచ్చునన్నారు. ముందుగా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ సాగుకు కావలసిన పరికరాలను అందించాలన్నారు. వ్యవసాయం సేద్యంచేస్తూ, ఉత్పత్తులతో ప్రగతి సాధిస్తున్న రైతులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు సంబంధిత పరికరాలను సబ్సిడీపై మంజూరు చేయాలన్నారు కట్టర్స్ , స్ప్రేయర్స్ వంటి యంత్ర పరికరాలు అందించి మరింత ప్రోత్సహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు పరిష్కరించడం జరిగిందని తెలియజేస్తూ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగేందుకు సమస్యలు తలెత్తకుండా ఇసుక, ఇటుక, కంకర, మొరం, ఐరన్ వంటి సామాగ్రి ధరలను నియంత్రించడమే కాక లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని, దానితో పాటు మేస్త్రి ల చార్జీలను నియంత్రింప చేస్తూ లబ్ధిదారుల ఇండ్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. వన మహోత్సవ కార్యక్రమం పై మాట్లాడుతూ 100 శాతం మొక్కలు నాటి ప్రగతి సాధించాలన్నారు. ప్రతి మొక్క జియో ట్యాగ్ చేయాలన్నారు. జాతీయ కుటుంబ లబ్ధి పథకం కింద అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి ఆర్థికంగా చేయూత అందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో స్టేషన్ఘన్పూర్ తాసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, ఏపీవో ప్రేమయ్య , పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల 42% రిజర్వేషన్‌కు పార్లమెంట్‌లో చట్టం చేయాలి

**9వ షెడ్యూల్లో కలపాలి**

**ద్వంద వైఖరి అవలంబిస్తున్న కేంద్ర బిజెపి సర్కారుపై పోరాడాలి**

**పైళ్ళ ఆశయ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి**

**తెలంగాణ రజక వృత్తి దారులసంఘం**


సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ళ ఆశయ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి తెలంగాణ రజక వృత్తి దారులసంఘం

జనగామ, ఆగష్టు 08 (నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో బీసీల విద్యా, ఉద్యోగ ,స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం చట్టం, చేసి 9వ షెడ్యూల్లో కలపాలని కేంద్ర ప్రభుత్వం దొంగ వైఖరిని నిరసిస్తూ పల్లె పల్లె నా తెలంగాణలో బీసీలంతా పోరాడాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ రజక వృత్తిదాల సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం ఎం.బి భవన్ లో శు క్రవారం రాష్ట్ర అధ్యక్షులు ఏదునూరి మదార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42% విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ఆర్డినెన్స్ ద్వారా కేంద్రాన్ని పంపించడం జరిగింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదించకుండా అసత్య ప్రచారాలతో ద్వంద వైఖరి అవలంబిస్తూ కాలయాపన చేస్తూ బీసీలను వంచిస్తుందని సందర్భంగా ఆశయ్య తీవ్రంగా విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బిజెపి మోడీని బీసీ అంటూ బీసీలను మోసగించి ఓట్ల దండుకొని ఓబీసీలని దేశవ్యాప్తంగా మోసగించిందని అన్నారు. 42% ఆర్డినెన్స్ బిల్లును ఆమోదించి బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని ప్రదర్శించాలని లేనియెడల వెనకబడిన తరగతులు అందరూ తెలంగాణలో బిజెపికి పుట్టగతులు లేకుండా చేస్తారని హెచ్చరించారు. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అమలవుతున్న 27 శాతం రిజర్వేషన్లు కూడా వర్గీకరణ తీసుకొస్తామని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని, ఓబీసీ బడ్జెట్ పెడతామని తెలిపిన ఎన్నిక ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ రంగా సర్వీసులలో అమలవుతున్న రైల్వే, బిఎస్ఎన్ఎల్, విమానయా, కేంద్ర ప్రభుత్వ రంగ సర్వీసులు వాటన్నిటిలో రిజర్వేషన్ లేకుండా ప్రైవేటీకరణ చేశారని అంబానీ ,ఆదానీలకు కట్టబెట్టిందని అన్నారు. ఓబీసీలను అన్యాయం చేసిందన్నారు. బిజెపి ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలైనక ఒక మాట తెలియపరుస్తూ బీసీలను మతం పేరుతో రెచ్చగొడుతూ వాడుకుంటుందని ఇకనైనా బీసీలు బిజెపి విధానాల పట్ల పోరాడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బిసి డెకరేషన్ లో వివిధ వృత్తిదారులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని వాటి సాధనకు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నారపు వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు వడ్డెబోయిన వెంకటేష్, కంచర్ల కుమార్, మరియాల గోపాల్, పాయిరాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట జిల్లాలో ఘనంగా కుంకుమార్చన



మక్తల్, ఆగస్టు,08, (నమస్తే ఉదయం): విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మాగనూర్ మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఘనంగా కుంకుమార్చన రక్షాబంధన్ వరలక్ష్మి వ్రతంలో భాగంగా లక్ష్మి నరసింహ స్వామికి కుంకుమార్చన తో పాటు ప్రత్యేక పూజలు గావించి మన హిందూ ధర్మంలోని అతి పవిత్రమైన ప్రధానమైన శ్రీ కు ప్రథమ స్థానం ఇవ్వడం జరిగింది మన యొక్క ఆది దేవతలు కూడా స్త్రీలకు సగభాగం ఇచ్చి మన ధర్మం లో స్త్రీల యొక్క కీర్తి ప్రతిష్టలకు మొట్ట మొదటి స్థానం కల్పించడం జరిగింది తధానంతరం రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనమిద్దరం ఈ ధర్మానికి దేశానికి రక్ష అనుకుంటూ ఒకరికొకరు రక్షాలు కట్టుకోవడం జరిగింది అనంతరం శ్రీ ప్రతిభ విద్యానికేతన్ నందు రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థినిలకు మీరు మీ యొక్క తల్లిదండ్రులను అలాగే అధ్యాపకులను గౌరవించాలని మీ యొక్క జీవితంలో ఉన్నత



స్థాయిలోకి వెళ్లేందుకు మీరు వారు ఇచ్చు సందేశాలను జాగ్రత్తగా గ్రహించి మీ ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్నటువంటి తల్లిదండ్రులను అధ్యాపకులను గౌరవించాలన్నారు విశ్వహిందూ పరిషత్ ప్రకండ అధ్యక్షులు కే సత్యనారాయణ గౌడ్ అన్నారు, మాగనూరు మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కృష్ణనయ్య, బజరంగ్ దళ్ జిల్లా సహా సంయోజక్ పసుపుల భీమేష్, శ్రీ ప్రతిభ విద్యానికేతన్ ఉపాధ్యాయ బృందం వెన్నెల, సంధ్య, స్పర్శ, హనుమంతు, బజరంగ్ దళ్ ప్రకండ సంయోజఖ్ రాహుల్, మూర్తి, అనిల్, దేవేంద్రప్ప పూజారి ప్రభు,తదితరులు పాల్గొన్నారు



## ఐకెపి విఓఎల నూతన కమిటీ ఎన్నిక

కేటి దొడ్డి, ఆగస్టు 8(నమస్తే ఉదయం) ఐకెపి వివో ఏ ఉద్యోగుల సంఘం కె టీ దొడ్డి మండల మహాసభ పి తిరుమల్ కుమార్ అధ్యక్షతన మండలంలోని ప్రైవేటు ఆఫీసులో జరిగింది. ఈ మహాసభను ఉద్దేశించి వివో ఏ ల సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యామ్ అంజి, సిఐటియు జిల్లా కార్యదర్శి వివి నరసింహ మాట్లాడుతూ... ఐకెపి వివో ఏల సమస్యల పైన సంఘటితంగా పోరాటాలకు సిద్ధం అవ్వాలని వివోఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీల ను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం కనీస వేతనం 20వేల రూపాయలు అమలు చేయాలని కోరారు. ప్రమాద ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, వివో ఏలకు గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివో ఏ లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తదితర చట్టబద్ధ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. వీటి పరిష్కారం కొరకు రాబోయే భవిష్యత్తులో మండలంలోని వివో ఏ లు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజి ,నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా తిరుమల్ కుమార్, కార్యదర్శిగా జయన్న, ఉపాధ్యక్షులుగా తిమ్మప్ప నందిని, సహాయ కార్యదర్శిలుగా నందిని పావని ,కోశాధికారిగా శ్రీనివాసులు, కమిటీ సభ్యులుగా బడేసాబ్ ,రవి భాగ్యలక్ష్మి ,మహదేవ్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిమ్మప్ప శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


జనగామ పట్టణంలో రాఖిలను కొనుగోలు చేస్తున్నా జనాలు

## జనగామ బస్టాండ్ చిన్న గేటు రోడ్డు మరో కోఠిని తలపిస్తున్నది

జనగామ, ఆగష్టు 08 (నమస్తే ఉదయం): జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చిన్న గేటు రోడ్డులోని వ్యాపార కేంద్రాలలో ముందస్తుగా జనాలు రాఖీలను కొనుగులు చేస్తున్నారు శుక్రవారం సాయంత్రం బస్టాండ్ చిన్న గేటు రోడ్డు నుండి పోచమ్మ గుడి వరకు దుకాణాల్లో జనాలు రాఖిలను, స్వీట్లను కొనుగులుచేస్తున్నారు దీనిని చూసిన స్థానిక ప్రజలు కొందరు ఈ రోడ్ లో జనాలను చూసి హైదరాబాదులోని కోఠి కేంద్రన్ని తలపిస్తున్నట్లుగా ఉంది అని అనుకుంటున్నారు.



మైనార్టీ పాఠశాల సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి...**

**విద్యార్థి దశ నుండే భవిష్యత్తులో సాధించే స్థాయిని ఎంచుకొని దృఢమైన లక్ష్యంతో సాధించేందుకు కృషి చేయాలి.**

**విద్యార్థులకు ఉద్బోధన చేసిన జిల్లాకలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

జనగామ, ఆగష్టు 08 (నమస్తే ఉదయం):జనగామ పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో ఉన్న తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను విద్యాశాఖ అధికారి భోజన్న, మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ కుమారస్వామి తో జిల్లా కలెక్టర్ శు క్రవారం సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. కలెక్టర్ ఈ సందర్భంగా 9, 10 తరగతిలో విద్యార్థులతో ముచ్చటించారు. వారి సామర్థ్యాలను పరిశీలిస్తూ భవిష్యత్తులో ఏమి కావాలని అనుకుంటున్నారని ప్రశ్నిస్తూ వారి నుండి సమాధానాలు రాబట్టారు. ఎంచుకున్న స్థాయిని బట్టి ప్రణాళిక బద్ధంగా కృషి చేయవలసి ఉ ంటుందన్నారు. ప్రతి ఒక్కరూ డిగ్రీ తప్పనిసరిగా పాస్ కావాలన్నారు. సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారంగా భోజనం పెడుతున్నారా, భోజనం ఎలా ఉంటున్నది? ఈరోజు ఏమేం పెట్టారు? అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు అందించిన పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫాంల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ కష్టపడి చదవాలని క్రమశిక్షణతో ఎదగాలన్నారు. భవిష్యత్తులో ఏమి కాదలుచుకున్నారో ఇప్పటినుండి ప్రణాళికగా ఎంచుకొని లక్ష్యం సాధించేందుకు నిరంతరం కృషి చేయాలి అన్నారు. కలెక్టర్ వెంట మైనార్టీ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.


ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

జనగామ, ఆగష్టు 08 (నమస్తే ఉదయం):నెల వారి తనిఖీ ల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సంబంధిత అధికారులతో తనిఖీ చేశారు.ముందుగా భద్రతను పరిశీలిస్తూ ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని భద్రత సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాలు పరిశీలించారు. రిజిస్టర్లో సంతకం చేశారు.కలెక్టర్ వెంట జనగామ ఆర్డిఓ గోపి రామ్, తాసిల్దార్ హుస్సేన్, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షణ అధికారి శ్రీకాంత్, ఎలక్షన్ సిబ్బంది, భద్రత సిబ్బంది ఉన్నారు.




## శ్రీజమ్ములమ్మ ఆలయానికి గంట వితరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8(నమస్తే ఉదయం)గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడులో వెలసిన శ్రీ జమ్ములమ్మ అమ్మవారిని ప్రముఖ సామాజికవేత చుక్క సుదర్శన్ రెడ్డి, చుక్క అశ్విని, చుక్క లక్ష్మీ ప్రణీత, చుక్క వైష్ణవ్ తేజ్ రెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీజములమ్మ అమ్మవారు, పరుశరామస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 8న సామాజికవేత సుదర్శన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా, అదే విధంగా ఈనెల 24న తన కుమారుడు చుక్క వైష్ణవ్ తేజ్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని రూ.3,200 విలువ చేసే కంచుతో తయారు చేసిన గంటను శ్రీజమ్ములమ్మ దేవాలయానికి వితరణ చేశారు.

# ప్రోటోకాల్ వివాదం ఇంతటితో ఆగేనా?





### కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి. సబితా ఇంద్రారెడ్డి.మధ్యన కోల్డ్ వార్ ఫుల్ స్టాప్ పడుతుందా

### చిరకాల ప్రత్యర్థుల మధ్యన మహేశ్వరంలో కొనసాగుతున్న రాజకీయ వార్

### మీరు ప్రోటోకాల్ పాటించలేదంటూ టిఆర్ఎస్ నాయకులు

### మీరు పాటించలేదంటూ కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు ప్రతి విమర్శలతో జోరందుకున్న రాజకీయాలు

### జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ముందే జిందాబాద్ లు జేజేలతో వాడి వేడిగా కొనసాగిన రేషన్ కార్డుల పంపిణీ

### అడ్డుకోవడం సమంజసం కాదని మంత్రి శ్రీధర్ బాబు తాము తగ్గేదే లేదంటూ సబితా ఇంద్రారెడ్డి

### చివరకు పోలీసుల జోక్యంతో సాఫీగా కొనసాగిన కార్డుల పంపిణీ

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8 నమస్తే ఉదయం: మహేశ్వరం నియోజకవర్గంలో గత కొంతకాలంగా బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ పార్టీ మధ్యన ప్రోటోకాల్ రచ్చ చిలికి చిలికి గాలివానగా మారుతూ కార్యకర్తల మధ్యన విద్వేషాలకు, దాడులకు దిగే ప్రమాదము ముంచుకు రావడంతో స్థానికంగా పోలీసులు రంగ ప్రవేశం చేయవలసిన అధ్వాన పరిస్థితులు నెలకొంటున్నాయి. %శ్రీ% మహేశ్వరం నియోజకవర్గం లో గత శాసనసభ ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి మధ్యన గత 30 సంవత్సరాలుగా రాజకీయ ప్రత్యర్థులుగా కొనసాగుతున్న విషయం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న రాజకీయ మేధావులకు ఉద్యమకారులకు ఈ రెండు కుటుంబాల మధ్యన ఉన్న రాజకీయ పోరు కొనసాగుతున్నప్పటికీ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో చేవెళ్లను వదిలి సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం నుంచి, మేడ్చల్ నియోజకవర్గం నుంచి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి పోటీ చేసి గెలుపొందారు. గత కొంతకాలం తర్వాత మేడ్చల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో తాండూర్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ ను ఆశించి అక్కడ తన అనుచరులతో ప్రచారానికి సామాగ్రిని సిద్ధం చేసుకుని రంగంలోకి దిగే సమయంలో కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని తాండూర్ కు బదులుగా మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ చివరి క్షణంలో నిర్ణయించడంతో కిచ్చిన గారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నుంచి రంగంలోకి దిగారు. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నుంచి రంగంలోకి దిగడంతో సబితా ఇంద్రారెడ్డి తన కుటుంబ చిరకాల రాజకీయ ప్రత్యర్థిని ఈ ప్రాంతం నుంచి నిలబెట్టడంతో సబితా ఇంద్రారెడ్డి కొంత ఉలిక్కిపాటుకు గురయ్యారనే అనే ప్రచారం కొనసాగుతుంది. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ మంత్రి, సబితా ఇంద్రారెడ్డి గెలుపొందడం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావడం వెను వెంటనే కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి చెందిన కాంగ్రెస్ అభ్యర్థులను నియోజకవర్గాలకు ఇన్చార్జిలుగా కొనసాగుతారని పార్టీ ప్రతిష్టతను పెంపొందించాలని వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేరవేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి వచ్చే ఎన్నికల వరకు ఆయా నియోజకవర్గాల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులుగా గెలుపు బాధ్యతలను కొనసాగిస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్



ఇన్చార్జులు గత 18 నెలలుగా మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులకు కార్యకర్తలకు అందుబాటులో కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి ధీటుగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు జిల్లాలో వివిధ శాఖల అధికారులు స్థానిక అధికారులతో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుకు సాగుతున్నారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ నాయకులు స్థానిక శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి కూడా కేఎల్ఆర్ కు దీటుగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉ ండడంతో వీరిద్దరి మధ్యన పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొంటున్నాయి. కె ఎల్ ఆర్ ప్రోటోకాల్ కు వ్యతిరేకంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని సబితా ఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు ఆరోపణలు చేస్తూ నిరసనలకు దిగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల పాటు మంత్రిగా కొనసాగిన సబితా ఇంద్రారెడ్డి పై కాంగ్రెస్ నాయకులు కూడా కౌంటర్ అటాక్ గా సబితా ఇంద్రారెడ్డి పై గతంలో ప్రభుత్వ కార్యక్రమంలో ఎక్కడ కూడా ప్రోటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ నాయకులకు అధిక ప్రాధాన్యతనిచ్చి వేదికలపై కూర్చోబెట్టడం వంటి దృశ్యాలతో కూడిన వీడియోలను గత మూడు నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కేటీఆర్ పాల్గొన్న సభలో సమావేశాల్లోనే ప్రోటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడికి దిగుతున్నారు. బడంగ్పేట్ మున్సిపాలిటీ మల్లాపూర్ లో జరిగిన వై ఏ ఆర్ గార్డెన్ లో రేషన్ కార్డులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల సభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా స్థానికంగా నియోజకవర్గంలో ఈ సంఘటన పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఏకధాటిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ కార్యక్రమాల వేదిక మీదికి ఆహ్వానించి వారి చేతనే కార్యక్రమాలు నిర్వహించారని వారు గుర్తు చేస్తున్నారు. 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మాజీ శాసనసభ్యుడు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఈ నియోజకవర్గంలో ఇన్చార్జి కేఎల్ఆర్ ను సభా వేదిక మీదికి ఒక అధికార పార్టీ నాయకునిగా హాజరు కావడంలో తప్పేముందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఏకంగా సబితా ఇంద్రారెడ్డి వేదిక మీదనే జిల్లా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సమక్షంలోనే కొంత ఆవేశానికి గురవుతూ ప్రోటోకాల్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోలీసు అధికారులపై సంబంధిత అధికారులపై జిల్లా మంత్రి సమక్షంలో కొంత ఘాటుగానే విమర్శలు చేశారు. దీంతో సభలో ఈ రెండు పార్టీల నాయకుల మధ్యన వాడి వేడిగా వాదోపవాదాలు, జిందాబాద్ లు, జేజేలు, విమర్శలు, ప్రతివిమర్శలు చోటుచేసుకున్నాయి. ఇక సందులో సడే మియా అంటూ ఈ రెండు పార్టీల నాయకుల మధ్యన కొనసాగుతున్న ప్రోటోకాల్ వివాదాన్ని స్థానిక బిజెపి నాయకులు ఈ నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు కూడా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఏకంగా తమ అనుచరులను సభలు సమావేశాలు పెడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో ఆయా కార్పొరేషన్లలో కార్పొరేటర్ పై, కౌన్సిలర్ల పై ప్రోటోకాల్ పేరుతో దాడులు చేయించారని కేసులు నమోదు చేయించారని ఏకంగా సబితా ఇంద్రారెడ్డి పై ఘాటు విమర్శలు చేస్తూ ఆమె ఆధ్వర్యంలో ఆనాడు బీఆర్ఎస్ నాయకులు వ్య వరించిన తీరుతో కూడిన దృశ్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ మూడు పార్టీల నాయకుల వ్యవహార శైలిపై రాజకీయ నాయకులు, మేధావులు , కవులు, కళాకారులు గమనిస్తున్నారు. ఇక ఈ ఫోటో కాల్ పేరుతో కొంతమంది కార్యకర్తలు అత్యుత్సాహం కనపరుస్తూ ఒక దశలో దాడులు చేసుకునే వరకు వెళ్లడం కొనసాగింది. ఏది ఏమైనప్పటికీ రాజకీయ నేపథ్యంలో ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న సబితా ఇంద్రారెడ్డి గాని, కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ముందుచూపుతో వ్యవహరిస్తూ ఈ ప్రోటోకాల్ వివాహ దానికి తెరదించుతారా అనే విషయంపై రాజకీయ నాయకుల్లో తర్జన భర్జనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రోటోకాల్ పై ఇప్పటికి రెండు మూడు సార్లు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్యన ఘర్షణ వాతావరణం నెలకొన్న దృష్ట్యా ఇకముందు పోలీసులు కూడా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవేళ పోలీసులు తగిన చర్యలు తీసుకోకపోతే మునుముందు ఈ ప్రోటోకాల్ వ్యవహారం మరింత జటిలంగా మారే పరిస్థితి ఉందని కొంతమంది అభిప్రాయపడుతున్నారు.



## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు టి. యాదీష్.**

మహేశ్వరం, ఆగస్టు 8, (నమస్తే ఉదయం)కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు టి. యాదీష్ అన్నారు. శుక్రవారం బిజెపి మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అంత్యోదయ లక్ష్యంతో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల గురించి ఇంటి ఇంటి కి వెళ్లి ప్రజలందరికీ అవగాహన కల్పించె విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. దేశ రక్షణకు, పేదల సంక్షేమానికి బిజెపి పార్టీ కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు బస్వ పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, మహేశ్వరం మండల ఎన్నికల కన్వీనర్ అనంతయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్, బీజేవైఎం చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కుండే వెంకటేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ యాదవ్, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు పంతు నాయక్, దేశ్యనయక్,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి యాదయ్య, నందిశ్వర్, బీజేవైఎం మండల అధ్యక్షులు శ్రావణ్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, బీజేవైఎం నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## కున్సిలో ఘనంగా పండుగల సాయన్న జన్మదిన కార్యక్రమం

మక్తల్, ఆగస్టు,08, (నమస్తే ఉదయం):క్రిష్ణ మండలం కున్సీ గ్రామంలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ దగ్గర పండుగల సాయన్న చిత్రపటానికి పూల మాల వేసి జన్మదిన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నల్లే నర్సప్ప గారు నైజం నవాబులను ఎదిరించి వారు దోచుకున్న సొమ్మును ధాన్యాన్ని ప్రజలకు పంచి ప్రజలను చైతన్యం చేసిన పండుగల సాయన్న ముదిరాజ్ కులంలో పుట్టడం గర్వకారణం అని వారిని ఆదర్శ%శీ%గా తీసుకొని ముదిరాజ్ లు పండగ సాయన్న స్పూర్తిగా ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ సంఘం పెద్దలు సిద్దప్ప మాస్టర్, రాంచదర్ మాస్టర్, మ్యాకలి మహాదేవ్, నల్లే శ్రీనివాస్,దుకాణం మహాదేవప్ప,పిట్టల చంద్రశేఖర్ ఖందొడ్డి నారాయణ, టీ సుగప్ప, జి మాణిక్యప్ప,మ్యాకల బాబు నల్లే వెంకటేష్, జె కిరప్ప,పిట్టల ప్రభు, బుర్ర రమేష్, బల్లెం కిష్టప్ప, బుర్ర తిరుమలేష్,ఏ సాంబ, గొర్రె సహదేవ తదితరులు పాల్గొన్నారు



## గద్వాలలో రాఖీల పండుగ సందడి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8(నమస్తే ఉదయం) గద్వాల జిల్లాలో రాఖీ పండుగ సందడి నెలకొంది. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పవిత్రంగా భావిస్తారు. ఇది శనివారం రావడంతో శుక్రవారం రాఖీల కొనుగోలుకు యువతులు, మహిళలు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలకు రావడంతో సందడిగా మారింది. గద్వాల పట్టణం కొత్తబస్టాండ్, క్రిష్ణవేణి చౌరస్తా, పాతబస్టాండ్, షేరెల్లీ వీధి, గాంధీచౌక్, తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా రాఖీల దుకాణాలు వెలిశాయి. చిన్న పిల్లల నుంచి యువతులు, మహిళలను ఆకర్షించే రాఖీలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. రూ. 5 నుంచి రూ.500 దాకా ధరలున్నాయి. పట్టణ వాసులతో పాటు నియోజక వర్గంలోని ధరూర్, కేటిదొడ్డి, మల్దకల్, అయిజ, ఎర్రవల్లి చౌరస్తా మండలాల గ్రామాల ప్రజలు రాఖీలు కొనుగోలతో వినియోగదారులతో వ్యాపార దుకాణాలు ఉదయంనుంచే కిటకిటలాడాయి. చిన్నారులు, యువతులు, మహిళలు రాఖీ దుకాణాల వద్ద బారులు తీరారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో స్వీటు షాపులు కూడా కళకళలాడుతున్నాయి.

# సర్కారు దవాఖాన వైద్యుల నిర్లక్ష్యం




### ఆడుకుంటున్న బాలుడికి ప్రమాదవశాత్తు గుచ్చుకున్న గాజు పెంకు.

### గాజు పెంకుతోనే కుట్లు వేసిన వైనం

### మహేశ్వరం సర్కారు దావాఖానలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన



మహేశ్వరం, ఆగస్టు 8 (నమస్తే ఉదయం) మహేశ్వరం సర్కారు దావఖానలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహేశ్వరం గ్రామానికి చెందిన 13 సంవత్సరాల గిరివర్మ అనే బాలుడు ప్రైవేటు దవాఖాలలో నరకయాతన అనుభవిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బీజేవైఎం మండల అధ్యక్షుడు వనంపల్లి శ్రావణ్ ఆధ్వర్యంలో మహేశ్వరం సర్కారు దావఖాన ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ.. రాను రా కొడుకో.. ఈ సర్కారు దవఖానకు అనేటట్లు ఉందని అన్నారు. గత 27 తారీఖున మహేశ్వరం గ్రామానికి చెందిన గిరి వర్మ అనే బాలుడు ఆటాడుకుంటున్న సమయంలో కాలుకి గాజు పెంకు గుచ్చుకుందని తెలిపారు. మహేశ్వరం ప్రభుత్వ దావఖానకు వైద్యం నిమిత్తం బాలుడు ప్రభుత్వ దవాఖానని ఆశ్రయించినట్లు ఆయన చెప్పారు. మహేశ్వరం దవాఖానలో గాయాన్ని పరిశీలించకుండానే కుట్లు వేశారని, రెండు రోజుల తర్వాత కాలుకు వాపు రావడంతో తిరిగి హాస్పిటల్ కు వచ్చాడని తెలిపారు. పరిశీలించి మందులు రాసి పంపించారు. రెండుసార్లు హాస్పిటల్ కు రావడంతో అవే మందు బిళ్ళలు రాసి పంపించినట్లు తెలిపారు. రోజుల తరబడి కాలుకు వాపు తగ్గకపోవడంతో నైటింగేల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడని ఆయన అన్నాడు. స్కానింగ్ చేసిన నైటింగేల్ ఆసుపత్రి వైద్యులు గాజు పెంకు ఉన్నట్టు నిర్ధారించి ఆపరేషన్ చేసి బయటకు తీశారని ఆయన వెల్లడించారు. రోజురోజుకు ప్రజా పాలనలో సర్కారు దవాఖాన పట్ల ప్రజలకు భరోసా లేకుండా పోతుందని ఆయన ఆగ్రహం వ్యక్తపరిచారు. మహేశ్వరం సర్కారు దవాఖాలలో గాజు పెంకుతోనే కుట్లు వేసిన వైద్యులపై జిల్లాస్థాయి వైద్యాధికారులు స్పందించి వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకపోతే మహేశ్వరంలో బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

**ఆసుపత్రి సూపరింటెండెంట్ అమేర్ సిద్ధిఖీ:**

గత నెల 27న కాలుకు తగిలిన గాయంతో సాయంత్రం టైంలో గిరివర్మ అనే బాలుడు హాస్పిటల్ కి రావడం జరిగింది. ఎక్కువగా బ్లీడింగ్ రావడంతో బ్లీడింగ్ ను ఆపేందుకు కుట్లు వేశారు. రెండు రోజులకు మందులు రాసి ఇచ్చారు. మరుసటి రోజు రమ్మని చెప్పాము. ఆ రెండు రోజుల తర్వాత వచ్చారు. కాలు వాపు రావడంతో వారు ప్రవేట్ హాస్పిటల్లో సంప్రదించారు. బాబుకు మహేశ్వరం హాస్పిటల్ లోనే వైద్యం చేస్తామని చెప్పినా గాని వినకుండా ప్రైవేట్ లోనే చూపించు కుంటామన్నారు. ట్రైనర్ ఎంఎన్ఓ ల సహాయంతో పరీక్షించారు. సాయంత్రం సమయంలో డ్యూటీ నిర్వహించే వైద్యులు వెళ్లిపోవడంతో ఎక్స్రేలు తీసేందుకు అవకాశం లేకపోవడంతోనే బ్లీడింగ్ ఆపడానికి కుట్లు వేయడం జరిగింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733